

## నాలుగు నెలలే అవకాశం

వేసవిలో సీతమ్మసాగర్ బ్యారేజీ పనులు చేపట్టేందుకు అనువుగా ఉండనున్నందున అనుమతులపై దృష్టి సారించాల్సి ఉంది. 10లో



## బొగ్గు రవాణాలో రికార్డ్

సింగరేణి పరిధిలో కొత్తగూడెం ఏరియా బొగ్గు రవాణా లక్ష్యాన్ని 45 రోజుల ముందే అధిగమించి రికార్డు సృష్టించింది. 10లో

గరిష్టం / కనిష్టం
35° / 18°

## వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం, రాత్రి చలి ప్రభావం కనిపిస్తుంది. మధ్యాహ్నం మాత్రం ఎండ ఎక్కువగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### నేడు జిల్లాలో డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన

**ఖమ్మంవన్‌టౌన్:** డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు హెలీకాప్టర్‌లో భద్రాచలం చేరుకోనున్న మంత్రులు అక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. ఆతర్వాత భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించే పాలకమండలి సమావేశంలో పాల్గొంటారు. అక్కడి నుంచి కల్లూరు మండలం నారాయణపురం వెళ్లి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడైన ప్రసాదరెడ్డి కుమారుడు లోహిత్‌రెడ్డి వివాహ రిసెప్షన్‌కు హాజరై హైదరాబాద్ బయలుదేరతారు.

### ఎంవీఐల బదిలీ

**ఖమ్మంక్రైం:** జిల్లా రవాణా శాఖలో పలువురు ఎంవీఐలను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఖమ్మం ఎంవీఐ వరప్రసాద్‌ను వైరాకు బదిలీ చేయగా, ఆయన స్థానంలో అశ్వారావుపేట చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎంవీఐ వెంకటరమణను కేటాయించారు. అలాగే, వైరా ఎంవీఐ శంకర్‌నాయక్‌ను ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి చెక్‌పోస్ట్‌కు, సత్తుపల్లి ఎంవీఐ వెంకటపుల్లయ్యను అశ్వారావుపేటకు, మంచిర్యాల జిల్లాలో పనిచేస్తున్న యోగి ఈశ్వర్‌సింగ్‌ను సత్తుపల్లికి బదిలీ చేస్తూ రవాణా శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

### జమలాపురంలో పూజలు

**ఎర్రుపాలెం:** తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూలవిరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారితదితరులు పాల్గొన్నారు.

### 24నుంచి పరీక్షలు

**ఖమ్మం సహకారనగర్:** ఈ నెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. అభ్యర్థుల హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడంతో ఇతర వివరాల కోసం www.bse. telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

### అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**ఖమ్మంమయూరిసెంటర్:** ఇందిర డెయిరీ ఏర్పాటు ప్రక్రియలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీఆర్‌డీఓ సన్యాసయ్య సూచించారు. మధిర మండలంలో ఏర్పాటుచేయనున్న ఇందిర మెగా డెయిరీపై ఆయన శనివారం ఖమ్మం టీటీడీసీలో సమీక్షించారు. సెర్ప్ ఉద్యోగులు మధిర నియోజకవర్గంలో మండలానికి 4వేల మందికి తక్కువ కాకుండా ఐదు మండలాల్లో 20వేల మందిని సభ్యులుగా చేర్చాలని సూచించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ జేడీ బి.వేణుమనోహర్‌రావు, నాబార్డు డీజీఎం సుజిత్‌కుమార్, ఎల్‌డీఎం ఎ.శ్రీనివాసరెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం అజయ్ కుమార్, డీపీఓ విజయనిర్మల, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.నవీన్‌బాబుతో పాటు నీలేష్, దర్గయ్య, లక్ష్మణ్‌రావు, రాంబాబు, తిరుమలరావు, కల్పన, డెయిరీ బాధ్యులు అన్నపూర్ణ, లలితకుమారి, వెంకటరమణ పాల్గొన్నారు.

### విత్తన గోదాం తనిఖీ

**రఘునాథపాలెం:** రఘునాథపాలెంలోని విత్తనాభివృద్ధి సంస్థ జిల్లా కార్యాలయం, విత్తన గోదాంను అసిస్టెంట్ కలెక్టర్ మాయాంక్‌సింగ్ శనివారం తనిఖీ చేశారు. ఖమ్మం ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ భాస్కరరావు పాల్గొన్నారు.

### పట్టాలు తప్పిన గూడ్స్



**చింతకాని:** ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ స్టేషన్ సమీపాన ఖమ్మం వైపు నుంచి విజయవాడ వైపు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు శనివారం పట్టాలు తప్పింది. గూడ్స్ నాగులవంచ సమీపానికి రాగానే ఇంజన్ నుంచి 25వ బోగీకి వెనుక చక్రాలు ఊడడంతో పట్టాలు తప్పింది. సుమారు కిలోమీటరు మేర ముందుకు వెళ్లడంతో ట్రాక్ ఇనుప సీలలు దెబ్బతిన్నాయి. ఈమేరకు సిబ్బంది చేరుకుని బోగీలోని బొగ్గును ఖాళీ చేసి క్రేన్ల సాయంతో పట్టాలు తప్పిన బోగీని పక్కకు తప్పించాక మిగిలినవి కలిపారు. దీంతో నాలుగున్నర గంటల తర్వాత గూడ్స్ ముందుకు కదలింది. అంత సేపు విజయవాడ వైపు వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఎక్కడికక్కడ నిలిపివేశారు. ఇదిలా ఉండగా నాగులవంచ – పాతర్లపాడు మార్గంలో గేట్ వద్ద గూడ్స్ నిలిచిపోగా వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

# అభయం.. అభయారణ్యం

**ఉమ్మడి ఖమ్మం జిల్లా** అటవీ ప్రాంతంలో అడవి దున్నల రక్షణ కోసం అభయారణ్యం ఏర్పాటుపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సత్తుపల్లి, పాల్వంచ రేంజ్‌ల్లో అడవి దున్నల సంఖ్య గతంలో కన్నా అనేక రెట్లు పెరిగిందని అటవీశాఖ అధికారుల లెక్కల్లో తేలింది. దీంతో ఇటీవల అటవీశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆ శాఖ మంత్రి కొండా సురేఖ.. సత్తుపల్లి, కిన్నెరసాని అటవీ ప్రాంతాల్లో అభయారణ్యం ఏర్పాటుపై చర్చించారు. ఇది కార్యరూపం దాలిస్తే వన్యప్రాణులకు మరింత రక్షణ లభిస్తుంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

- ఉమ్మడి జిల్లాలో ఏటా పెరుగుతున్న అడవిదున్నల సంతతి
- ప్రత్యేక శాంక్చురీ ఏర్పాటుకు అటవీ శాఖ కసరత్తు
- ఇటీవల అధికారులతో సమీక్షించిన మంత్రి సురేఖ
- శాంక్చురీ ఏర్పాటైతే వన్యప్రాణులకు మరింత రక్షణ



పాల్వంచ అటవీ రేంజ్ పరిధిలో నీటికుంటల వద్ద అడవి దున్నలు



సత్తుపల్లి రేంజ్‌లో సాసర్ పిట్ వద్ద అధికారులు



**విస్తరించిన అటవీ ప్రాంతం**

ఉమ్మడి జిల్లాలో అటవీ ప్రాంతం విస్తరించి ఉండగా.. వేలాదిగా వన్యప్రాణులు ఆశ్రయం పొందుతున్నాయి. వీటి రక్షణకు అటవీశాఖాధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. సత్తుపల్లి రేంజ్‌లో 18,114 హెక్టార్ల అడవి ఉండగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ అటవీ డివిజన్‌ను ఆనుకొని ఎర్రగుంట, వీఎం.బంజర, తల్లాడ, అన్నపురెడ్డిపల్లిలో సగం మేర సత్తుపల్లి డివిజన్ విస్తరించి ఉంటుంది. ఈ ప్రాంతంలో అటవీ అభివృద్ధి కోసం పదేళ్లలో సుమారు 10.27 లక్షల మొక్కలు నాటగా పచ్చదనం సంతరించుకుంది. ఫలితంగా గతంతో పోలిస్తే వన్యప్రాణుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుత లెక్కల ప్రకారం సత్తుపల్లి, పాల్వంచ రేంజ్‌ల పరిధిలో 1,600కు పైగా అడవి దున్నలు ఉన్నాయి. కాగా, గత నాలుగైదేళ్లలో నాలుగు దున్నలు వేటగాళ్ల ఉచ్చులో పడి మృతి చెందాయి.

**వన్యప్రాణుల రక్షణకు..**

వేసవిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు సత్తుపల్లి రేంజ్ పరిధిలో 35 వాటర్ సాసర్ పిట్స్, 43 నీటి కుంటలు ఏర్పాటు చేశారు. అలాగే, అగ్నిప్రమాదాలు జరగకుండా 150 కిలోమీటర్ల మేర ఫైర్‌లైన్స్ ఉన్నాయి. అటవీ ఉద్యోగులు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ వన్యప్రాణులను వేటాడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. సీసీ కెమెరాలు, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పటిష్టం చేశారు. ప్రత్యేకంగా అడవి దున్నలు రాష్ట్రంలోనే ఈ రెండు రేంజ్‌ల పరిధిలో గణనీయంగా పెరుగుతుండటంతో వీటి రక్షణకు పకడ్బందీగా చర్యలు తీసుకునేలా శాంక్చురీ ఏర్పాటుపై అటవీశాఖ యంత్రాంగం అధ్యయనం చేస్తోంది.

**అభయారణ్యం ఏర్పాటైతే మరింత రక్షణ**

ఉమ్మడి జిల్లాలోని అటవీ ప్రాంతంలో అడవి దున్నల సంతతి పెరగడంతో సంరక్షణపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇక్కడ దున్నల సంతతి పెరుగుదల గణనీయంగా నమోదైన నేపథ్యాన ఇటీవల అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులతో చర్చించారు. ప్రధానంగా అభయారణ్యం ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరిగాయి. ఇదే జరిగితే అడవి దున్నలు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఏర్పడుతుంది. అంతేకాక నిఘా పెరిగి.. ఇతర వన్యప్రాణుల రక్షణ కూడా అటవీ అధికారులకు సులభమవుతుంది.

### అప్పుడు అరుదే...

సత్తుపల్లి రేంజ్‌లో గత 15 ఏళ్లుగా తీసుకుంటున్న అటవీ సంరక్షణ చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలతో అడవి దున్నల సంతతి పెరిగింది. గతంలో అరుదుగా అప్పుడప్పుడు కనిపించే అడవి దున్నలు ఇప్పుడు చాలాచోట్ల ట్రాప్ కెమెరాలకు చిక్కుతున్నాయి. ప్రధానంగా రేంజ్‌లోని యాతాలకుంట, రుద్రాక్షపల్లి, భావన్నపాలెం, కిష్టారం, లంకపల్లి సెక్షన్లలోని 14 బీట్లలో వీటి కదలికలు ఎక్కువగా ఉన్నాయి. సుమారు 10 వేల హెక్టార్ల పరిధిలో వీటి సంచారం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. భద్రాద్రి జిల్లాలోని పాల్వంచ రేంజ్, కిన్నెరసాని అభయారణ్యంలో అటవీ ప్రాంతం విస్తరించి ఉండడం, అటవీ అధికారుల కట్టుదిట్టమైన నిఘాతో అడవి దున్నలు వృద్ధి చెందినట్లు అంచనా. ఇతర జంతువులతో పోలిస్తే అడవి దున్నలు భారీగా పెరగడం.. వీటిని పట్టుకోవడం కష్టం కావడంతో వేటగాళ్లు కూడా పెద్దగా దృష్టి సారించడం లేదని తెలుస్తోంది.

### పచ్చదనం పెంపుతోనే..



వన్యప్రాణుల సంరక్షణ కోసం నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నాం. అటవీ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. నీటి నిల్వలు, పచ్చదనం పెంచటంతో సత్తుపల్లి రేంజ్ వన్యప్రాణులకు ఆవాసంగా మారింది. అడవి దున్నలు, వన్యప్రాణుల సంతతి బాగా పెరుగుతోంది.

– పి.స్నేహలత, రేంజ్ ఆఫీసర్, సత్తుపల్లి

### నిఘాతో వన్యప్రాణులకు రక్షణ



అటవీ ప్రాంతాల సమీపాన గ్రామాల ప్రజలకు జంతువుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నాం. అనువైన అటవీ ప్రాంతం ఉండడం, వేసవిలోనూ నీటి వసతి కల్పించడంతో అడవి దున్నల సంతతి పెరుగుతోంది. జీవాలకు రక్షణ కల్పిస్తూనే పటిష్టమైన నిఘా ఏర్పాటుచేశాం.

– కట్ల దామోదర్ రెడ్డి, ఎఫ్‌డీఓ, పాల్వంచ డివిజన్

# మొక్కుబడిగానేనా?

- ఎట్టకేలకు నేడు ఐటీడీఏ పాలకమండలి భేటీ
- హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల
- రూ.30 కోట్ల పనులకు బడ్జెట్ ఆమోదించే అవకాశం !

**భద్రాచలం:** భద్రాచలం ఐటీడీఏ పాలకమండలి సమావేశం ఎట్టకేలకు ఆదివారం జరుగనుంది. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు చేపట్టాల్సిన ప్రణాళికల రూపకల్పన కోసం మూడు నెలలకు ఒకసారి ఈ సమావేశం నిర్వహించాల్సి ఉండగా.. 19 నెలల తర్వాత జరుగుతోంది. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరు కానున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు మొదలయ్యే సమావేశంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల ఉన్నతాధికారులు హాజరవుతారు. ఈమేరకు ఏర్పాట్లపై ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సమీక్షించారు.

**రెండు గంటలు మాత్రమే..**

గిరిజనుల అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించాల్సిన సమావేశాన్ని కేవలం రెండు గంటలకే పరిమితం చేశారు. ఈ కొద్ది సమయం నివేదికల సమర్పణ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్ సందేశంతోనే సరిపోనుండగా, సమస్యలపై చర్చించడం కష్టమేనని గిరిజన సంఘాల నాయకులు అంటున్నారు. అలాగే, తమ సమస్యలపై విన్నవించే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

**రూ.30 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం !**

కొద్ది నెలలుగా ఐటీడీఏకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించక అనేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. అయితే ప్రభుత్వం కేటాయించిన రూ.30 కోట్ల పనులకు బడ్జెట్ రూపకల్పన చేయాలని మంత్రులు, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. ఇన్‌చార్జ్ మంత్రి ఆధ్వర్యాన ఉండే ఈ నిధులు ఖర్చు చేసేందుకు కొద్దిరోజులే సమయం ఉండగా, ఆగమేఘాలపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

**రెండో బ్రిడ్జి పనులను పరిశీలించేనా ?**

భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి పనులు ఎనిమిదేళ్లుగా సా..గుతూనే ఉన్నాయి. ఈ పనులను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. జిల్లాకు చెందిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు నెలల క్రితం పనులు పరిశీలించి అధికారులను మందలించారు. ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే ఈ గడువులోగా పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. కనీసం ఏప్రిల్‌లో జరిగే శ్రీరామనవమి నాటికైనా బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు. ఆర్అండ్‌బీ శాఖ మంత్రి హోదాలో తొలిసారి భద్రాచలం వస్తున్న మంత్రి కోమటిరెడ్డి పనులను పరిశీలించి జాతీయ రహదారుల శాఖ ధికారులతో చర్చించి త్వరగా పూర్తయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# ఈవీఎంల పరిశీలన పూర్తి

- పనిచేయని ఈవీఎంల తరలింపు
- కలెక్టర్ వీ.పీ.గౌతమ్

**ఖమ్మం సహకారనగర్:** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యాన జిల్లాలో ఈవీఎం ఫస్ట్ లెవల్ చెకప్ (ఎఫ్ఎల్‌సీ) ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఈసందర్భంగా కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను వివిధ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడారు. ఎఫ్ఎల్‌సీలో సక్రమంగా పనిచేయడం లేదని గుర్తించిన ఈవీఎంలను మరమ్మతు కోసం భద్రత నడుమ కంపెనీకి తరలించినట్లు తెలిపారు. ఆతర్వాత ఈవీఎంల భద్రత, సీసీ కెమెరాల నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, ఉద్యోగులు రాంబాబు, సయ్యద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

**పాత కార్పొరేషన్ భవనం పరిశీలన**

**ఖమ్మంమయూరిసెంటర్:** ఖమ్మంలోని పాత మునిసిపల్ కార్పొరేషన్ భవనాన్ని కలెక్టర్ గౌతమ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి శనివారం పరిశీలించారు. ఇక్కడ గ్రంథాలయ నిర్వహణకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అలాగే, పెవిలియన్ గ్రౌండ్ వద్ద జిల్లా గ్రంథాలయ భవనం ఇటీవల కూలిపోగా, అక్కడ నిర్మించే నూతన భవన నమూనా వివరాలు ఆరా తీశారు. అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎస్‌డీసీ ఎం.రాజేశ్వరి, గ్రంథాల య కార్యదర్శి మంజువాణి, అధికారులు నాగశేషు, మాధవి, సాయి తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం గోదాం వద్ద భద్రతపై సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్

# ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

**ఖమ్మం సహకారనగర్:** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈనెల 28వ తేదీన మొదలుకానుండగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన ఇంటర్మీడియట్ విద్యాశాఖ, వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ 70 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదనే విషయమై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యాన బందోబస్తు, వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన శిబిరాలు నిర్వహించాలని, దూర ప్రాంతాల వారికి బస్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ఈసమావేశంలో ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు, డీఈఓ సోమశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.

# జాతరపైనే ఆశలు...

### నేటి నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు

- రీజియన్ పరిధిలో 494 సర్వీసుల ఏర్పాటు
- లక్ష్యం మేర ఆదాయం రాబట్టేలా ప్రణాళిక
- ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



కొత్తగూడెం బస్టాండ్‌లో వేసిన చలువ పందిళ్లు



గత జాతర సమయంలో ఏర్పాటు చేసిన బస్సులు(ఫైల్)

**చుంచుపల్లి:** ఆసియాలోనే అతిపెద్దదిగా పేరున్న మేడారం సమ్మక్క – సారలమ్మ జాతరకు సమయం ఆసన్నమైంది. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ జాతరను తిలకించి, మొక్కులు చెల్లించుకునేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివెళ్తుంటారు. ఈనెల 21 నుంచి 24 వరకు అత్యంత వైభవంగా జరిగే ఈ మహాజాతరకు ఖమ్మం రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ఆదివారం నుంచి సర్వీసులు తిప్పేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. జాతర ముగిసిన తెల్లవారి కూడా బస్సులు నడపనున్నారు. జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో ఏర్పాటు చేసిన 11 పాయింట్ల వద్ద మౌలిక వసతుల ఏర్పాట్లపై అధికారులు వారం రోజులుగా దృష్టి సారించారు. రీజియన్‌లో ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు, చర్ల, టేకులపల్లి, పాల్వంచ, మంగపేట, వెంకటాపురం, ఏటూరునాగారం నుంచి జాతర బస్సులు మేడారానికి తిప్పుతారు. ఈ 11 పాయింట్ల ద్వారా 494 సర్వీసులు అందుబాటులో ఉంచుతారు. మేడారం వెళ్లడానికి మణుగూరు – ఏటూరునాగారం మీదుగా కొన్ని సర్వీసులు, ఇల్లెందు – గుండాల మీదుగా మరికొన్ని బస్సులు నడిపేలా అధికారులు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ప్రస్తుతం మేడారానికి డిపోకు ఒకటి, రెండు చొప్పున బస్సులను తిప్పుతుండగా, ఆదివారం నుంచి మరిన్ని సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. గతంలో కంటే ఈసారి భక్తులు పోటెత్తే అవకాశం ఉండడంతో ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర పాయింట్ల వద్ద ప్రత్యేకంగా చలువ పందిళ్లు, టెంట్లు, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులకు తగిన సమాచారం అందించేందుకు ఆయా పాయింట్లలో 450 మంది సిబ్బందిని కేటాయించారు. మహాలక్ష్మి పథకం అమల్లో ఉన్నందున ఉమ్మడి జిల్లా నుంచి రెండు లక్షల మంది మహిళలు మేడారం వెళ్తారని అధికారుల అంచనా.

**మెగా జాతరతో ఆర్టీసీకి ఆదాయం**

ఈ నెల 21 నుంచి 24 వరకు జరగనున్న మేడారం జాతరకు రీజియన్‌లో 494 ఆర్టీసీ బస్సులను నడిపేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. వీటిలో ఖమ్మం రీజియన్ నుంచి 130, నల్లగొండ రీజియన్ నుంచి 94, హైదరాబాద్ సిటీ నుంచి 270 బస్సులను వినియోగించనున్నారు. ఇందుకోసం ఆరు డిపోల పరిధిలో 11 జాతర పాయింట్లను ఏర్పాటు చేశారు. పాయింట్ల వారీగా బస్సులు కేటాయించారు. దాని ప్రకారం ఖమ్మం నుంచి 30 బస్సులు, ఇల్లెందు నుంచి 124, వెంకటాపురం నుంచి 11, ఏటూరునాగారం 34, చర్ల 10, మణుగూరు 25, మంగపేట 10, కొత్తగూడెం 130, టేకులపల్లి 25, పాల్వంచ 45, భద్రాచలం నుంచి 50 బస్సులను అందుబాటులో ఉంచుతారు. వీటితో పాటు జాతర రద్దీని బట్టి అవసరమైతే ఇతర ప్రాంతాల నుంచి మరికొన్ని సిటీ బస్సులు తెప్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇక 2018లో జరిగిన మేడారం జాతరకు ఉమ్మడి జిల్లా నుంచి 1.06 లక్షల మంది ఆర్టీసీలో వెళ్లగా రూ.2.05 కోట్ల ఆదాయం వచ్చింది. 2020లో 1.33 లక్షల మంది ప్రయాణికుల నుంచి రూ.2.96 కోట్లు వచ్చాయి. 2022 జాతరపై కరోనా ప్రభావం తీవ్రంగా పడింది. ఎక్కువ మంది భక్తులు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లడంతో ఆర్టీసీ ఆదాయం గణనీయంగా తగ్గింది.

**మేడారానికి చార్జీల వివరాలు (రూ.ల్లో)**

| పాయింట్ | పెద్దలు | పిల్లలు |
|---|---|---|
| ఇల్లెందు | 270 | 150 |
| కొత్తగూడెం | 350 | 180 |
| టేకులపల్లి | 350 | 180 |
| భద్రాచలం | 300 | 160 |
| మణుగూరు | 210 | 120 |
| ఏటూరునాగారం | 80 | 50 |
| మంగపేట | 110 | 70 |
| పాల్వంచ | 310 | 170 |
| ఖమ్మం | 480 | 250 |
| చర్ల | 250 | 130 |
| వెంకటాపురం | 150 | 80 |

### భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు



ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే మేడారం జాతరకు ఉమ్మడి జిల్లా నుంచి ఆర్టీసీ బస్సుల్లో తరలివెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. రీజియన్ నుంచి మేడారానికి 11 పాయింట్ల ద్వారా 494 బస్సులు నడిపిస్తాం. ఇందుకోసం 1,500 మంది కండక్టర్లు, డ్రైవర్లను వినియోగిస్తున్నాం. వీరే కాకుండా మరో 450 మంది సిబ్బందిని ప్రయాణికులకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంచుతాం.

– సీహెచ్.వెంకన్న, ఆర్టీసీ ఆర్ఎం

### మేడారం భక్తులకు ప్రత్యేక రైలు

**ఖమ్మంమామిళ్లగూడెం:** ములుగు జిల్లా మేడారంలో జరగనున్న సమ్మక్క – సారలమ్మ జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే ఖమ్మం నుంచి వరంగల్ వరకు ప్రత్యేక రైలు నడపనుంది. ఈ నెల 23న ఖమ్మం – వరంగల్ ప్రత్యేక రైలు ఉదయం 10 గంటలకు ఖమ్మం స్టేషన్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.20 గంటలకు వరంగల్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 1.55 గంటలకు వరంగల్ నుంచి బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు ఖమ్మం చేరుకుంటుందని ఖమ్మం సీసీఐ జాఫర్ తెలిపారు. ఈ రైలుకు మల్లెమడుగు, పాపటపల్లి, డోర్నకల్, గుండ్రాతిమడుగు, మహబూబాబాద్, కేసముద్రం, నెక్కొండ, చింతలపల్లి స్టేషన్లలో హాల్టింగ్ ఉంటుందని, ఈ రైలులో సీటింగ్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. అయితే, రైలు వరంగల్ చేరుకున్నాక తిరిగి బయలుదేరేందుకు మధ్యలో గంటన్నర సమయమే ఉండడం, ఒకేరోజు రైలు నడిపించనుండడంపై మేడారం వెళ్దామనుకున్న భక్తుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

### ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోండి

**సత్తుపల్లిటౌన్:** వివిధ రంగాల్లో ఉన్న ఉపాధి అవకాశాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ సూచించారు. రాష్ట్ర ఉపాధి శిక్షణ, ఏపీ ప్రొడక్టవిటీ కౌన్సిల్ ఆధ్వర్యాన 'స్వయం ఉపాధి – వేతన ఉపాధి' అంశంపై సత్తుపల్లిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్‌తో పాటు గుడిపూడి సుజాత, ప్రసాద్, నరేష్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీ దళాలు కనుమరుగు?

- అశోక్ అరెస్ట్‌తో సీపీఐ(ఎంఎల్) చంద్రన్న వర్గం డీలా
- అజ్ఞాత నేతలపై నాలుగేళ్లుగా దృష్టి సారించిన పోలీసులు
- చీలికలు, పేలికలతో ప్రశ్నార్థకంగా మారిన ఉనికి

**ఇల్లెందు:** పార్టీ రాష్ట్ర కార్యదర్శి అరెస్ట్‌తో సీపీఐ(ఎంఎల్) చంద్రన్న వర్గం పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎన్డీ అజ్ఞాత దళాలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది.

1967లో ఓ గ్రూపు సీపీఎం నుంచి విడిపోయి సీపీఐ(ఎంఎల్)గా ఏర్పడింది. సాయుధ దళాలు ఏర్పాటు చేసుకుని ఉమ్మడి ఖమ్మం–వరంగల్ జిల్లాల్లో సుదీర్ఘ కాలంపాటు అలజడి రేపింది. 2020 వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. తాజాగా ఎంఎల్ చంద్రన్న వర్గం రాష్ట్ర కార్యదర్శి కుర్సం వజ్జయ్య అలియాస్ అశోక్(ఏకే), గోపి(ధనసరి సమ్మయ్య), పుల్లన్న తదితరుల అరెస్ట్‌తో ఆ పార్టీ డీలా పడింది. గత నాలుగేళ్లలో మధు, గోపి, లింగన్న, సాగర్, పుల్లన్న, యాకన్న తదితర న్యూడెమోక్రసీ అజ్ఞాత నేతలు ఒక్కొక్కరుగా పోలీసులకు చిక్కారు. లింగన్న మళ్లీ అడవిబాట పట్టగా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. గోపి ఇటీవల కాలంలో మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లాడు.

**వల వేసి పట్టుకున్న పోలీసులు**

అశోక్ ఏడాది క్రితం రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. కొంతకాలం పాటు ఆంధ్రలో తలదాచుకున్న ఆయన ఆరు నెలల క్రితం మళ్లీ సరిహద్దు అటవీ ప్రాంతంలోకి వచ్చినట్లు సమాచారం. కొందరు మాజీలను చేరదీసి దళాల నిర్మాణం చేపట్టినట్లు సమాచారం అందగా, పోలీసులు నిఘా తీవ్రతరం చేశారు. వల వేసి పట్టుకున్నారు. ఇక ఇల్లెందు మండలం మర్రిగూడెం పంచాయతీ ఎల్లాపురం గ్రామానికి చెందిన, దళ నేత పూనెం బాబు(ఎన్డీ యతీంద్రకుమార్ వర్గం) అలియాస్ రమేష్ ఒక్కడే అజ్ఞాతంలో ఉన్నాడు. దీంతో పోలీసులు


ఇల్లెందు సమీపంలో గుట్టలతో కూడిన అటవీ ప్రాంతం

అతని కోసం గట్టి నిఘా పెట్టారు. అశోక్ తదితరుల అరెస్ట్ సమయంలో మరి కొందరు దళ సభ్యులు తప్పించుకున్నట్లు తెలుస్తోంది. వారికోసం శనివారం పోలీసులు మహబూబాబాద్, భద్రాద్రి జిల్లాల సరిహద్దుల్లో గాలింపు చర్యలు చేపట్టారు.

**తోటి దళాల దాడులు..**

ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల సరిహద్దు ప్రాంతాలపై బయ్యారం, గూడూరు, కొత్తగూడ, గంగారం, ఇల్లెందు, గుండాల మండలాల అటవీ ప్రాంతంలో న్యూడెమోక్రసీ బలంగా ఉండేది. ఈ నేపథ్యంలో అశోక్ ప్రాబల్యం కలిగిఉండగా, ఆయన దళంపై మావోయిస్టు దళాలు భీరోనిమడువ అటవీప్రాంతంలో దాడి చేశాయి. ఆయుధాలను ఎత్తుకెళ్లాయి. ప్రజాప్రతిఘటనకు చెందిన శంకరన్న సైతం దాడులు జరిపాడు. అయితే ఈ దాడుల నుంచి అశోక్ చాకచక్యంగా తప్పించుకున్నాడు.

**పలు కేసులు**

దళనేతగా కొనసాగుతున్న సమయంలో అశోక్‌పై పోలీసులు పలు కేసులు నమోదు చేశారు. ఇర్సులాపురం గ్రామానికి చెందిన ఎనుగుల మల్లేష్, బండారి మల్లయ్య, అడ్వకేట్ రూపిరెడ్డి రవీందర్‌రెడ్డి, జగత్‌రావుపేట గ్రామానికి చెందిన పర్శిక బొర్రయ్య, బయ్యారానికి చెందిన గోపి హత్య కేసులు నమోదయ్యాయి.

**అజ్ఞాతంలోనే చదువు..**

కుర్సం వజ్జయ్య అలియాస్ అశోక్ బయ్యారం మండలం రామచంద్రాపురంలోని పేద ఆదివాసీ కుటుంబంలో జన్మించగా, తల్లిదండ్రులు బాల్యంలో ఓ రైతు వద్ద పాలేరుగా పెట్టారు. ఆ సమయంలో న్యూడెమోక్రసీ(అప్పుడు ప్రజాపంథా) ప్రాబల్యం ఉండగా, తరచూ దళాలు సంచరిస్తుండటంతో నక్సలైట్ ఉద్యమంవైపు ఆకర్షితుడై దళంలో చేరాడు. క్రమశిక్షణతో అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర కార్యదర్శిస్థాయికి చేరుకున్నాడు. నిరక్షరాస్యుడిగా పార్టీలో చేరిన వజ్జయ్య నాయకుల ప్రేరణతో చదువు నేర్చుకున్నాడు. తోటి దళసభ్యురాలు సనప రమణను వివాహం చేసుకోగా, వీరికి ఒక కుమార్తె ఉంది. కొన్నాళ్ల క్రితమే లొంగిపోయిన ఆమె గ్రామంలో సాధారణ జీవితం గడుపుతోంది.


కుర్సం వజ్జయ్య అలియాస్ అశోక్(ఏకే)

**నిర్బంధం తగ్గిందని భావించి..**

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడగా, పార్టీపై నిర్బంధం ఉండదని భావించిన ఎన్డీ నాయకులు తిరిగి అటవీప్రాంత ప్రజలకు చేరువయ్యేందుకు ఇటీవల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అశోక్ బయ్యారం, ఇల్లెందు మండలాల ప్రజలను కలిశారనే ప్రచారం జరగ్గా, పసిగట్టిన పోలీసులు పథకం ప్రకారం పట్టుకున్నట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక నిషేధిత మావోయిస్టు కార్యకలాపాలు తగ్గటంతోపాటు ఇతర నక్సల్స్‌గ్రూపులు జనశక్తి, ప్రజాప్రతిఘటన, ప్రతిఘటన పార్టీల దళాలు కనుమరుగయ్యాయి. దీంతో మిగిలి ఉన్న ఎన్డీ దళాలపై పోలీసులు దృష్టి సారించారు. 2016 నుంచే నిఘా పెట్టిన పోలీసులు కొంతవరకు విజయం సాధించినా అగ్రనేత అశోక్‌ను అరెస్ట్ చేయలేకపోయారు. తాజాగా అదుపులోకి తీసుకోవడంతో ఎన్డీ దళాల ఉనికి కనుమరుగైనట్లేననే విప్లవోద్యమశ్రేణులు పేర్కొంటున్నాయి.

**ఎంఎల్ ప్రస్థానం..**

సీపీఐ(ఎంఎల్) 1967లో ఆవిర్భవించగా, చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలో పోట్ల రామనర్సయ్య రాష్ట్ర కార్యదర్శిగా సాయుధ దళాల నిర్మాణ సాగింది. రైతు–కూలీల సమస్యలు, పోడు, తునికాకు తదితర సమస్యలపై ప్రజలను సమీకరించి గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉద్యమాన్ని నిర్మించారు. 1984లో ఎంఎల్ పార్టీ.. సీపీఐ(ఎంఎల్) విమోచన, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రెండుగా విడిపోయింది. 1987లో విమోచన నుంచి ఓ గ్రూపు విడిపోయి ప్రతిఘటన, దాని నుంచి మరో గ్రూపు విడిపోయి ప్రజాప్రతిఘటన ఏర్పడ్డాయి. 1994లో విమోచన ఏడు సంస్థలతో కలిసి జనశక్తిగా ఆవిర్భవించింది. ఇక ప్రజాపంథా ఎన్డీగా మారగా, 2013లో ఎన్డీ.. రాయల వర్గం, చంద్రన్న వర్గాలుగా విడిపోయింది. 2022లో రాయల వర్గం నుంచి మరో వర్గం చీలి ప్రజాపంథా మారింది. ఇలా ఎంఎల్ పార్టీలో ఆవిర్భావం నుంచి 2022 వరకు అనే చీలికలు ఏర్పడ్డాయి.

## క్లుప్తంగా

### బీఆర్ఎస్ కార్యాలయంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ మధు, మేయర్ నీరజ తదితరులు

**ఖమ్మంమయూరిసెంటర్:** బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ కేక్ కట్ చేసి మాట్లాడారు. తెలంగాణ సాధించిన ఘనత కేసీఆర్‌దేనని, రాష్ట్ర ముఖ్యమంత్రిగానూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. అనంతరం కార్యాలయ ఆవరణలో హరితహారం మొక్క నాటారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు, ప్రజాప్రతినిధులు బెల్లం వేణు, ఉప్పల వెంకటరమణ, సుబ్బారావు, చింతనిప్పు కృష్ణచైతన్య, కర్నాటి కృష్ణ, దండా అయ్యప్ప జ్యోతిరెడ్డి, మదూరి ప్రసాద్, కూరాకుల వలరాజు, మోతారపు శ్రావణి సుధాకర్, షౌకత్ అలీ, కన్నం కృష్ణప్రసన్న, చిరుమామిళ్ల రవికిరణ్, చుంచు విజయ్‌కుమార్, ముత్యాల వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ కనెక్షన్ అప్‌డేట్ పేరిట ఫోన్లు

**ఖమ్మంవ్యవసాయం:** 'మీ విద్యుత్ కనెక్షన్ నంబర్‌ను అప్‌డేట్ చేసుకోండి. లేనిపక్షంలో రాత్రి 10:30 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తాం' అంటూ గుర్తుతెలియని వ్యక్తి జిల్లాలోని పలువురు వినియోగదారులకు ఫోన్ చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. దీంతో కొందరు విద్యుత్ ఉద్యోగులకు సమాచారం ఇవ్వగా, విషయం ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి దృష్టికి చేరింది. దీంతో ఆయన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఉద్యోగులు సదరు వ్యక్తి నంబర్ (78158 21290)కు ఫోన్‌కు చేశారు. ఈ మేరకు తనది హైదరాబాద్ అని చెబుతూ ఎవరు ఫోన్ చేసినా వారి నంబర్‌బ్లాక్ చేయడం మొదలు పెట్టాడు. ఇక ఫలితం లేదని పోలీసులకు విద్యుత్ అధికారులు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. కాగా, సర్వీస్ నంబర్ అప్‌డేట్, బిల్లులు చెల్లించాలని తమ శాఖ నుంచి ఎవరూ ఫోన్ చేయరని, ఈ విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

### ఏడేళ్ల చిన్నారిపై కుక్కల దాడి

**నేలకొండపల్లి:** ఏడేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని శంకరగిరితండా గ్రామానికి చెందిన బి.తేజ (7) శనివారం ఇంటి వద్ద ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి. స్థానికులు గుర్తించి అరవడంతో కుక్కలు పారిపోగా, బాలుడికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. కాగా, మండలంలో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నందున నివారణపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

### 200 కేజీల నల్లబెల్లం, నాటుసారా స్వాధీనం

**ఖమ్మంక్రైం:** ఖమ్మం జిల్లా మీదుగా తరలిస్తున్న నల్లబెల్లంతో పాటు నాటుసారాను ఎక్సైజ్ ఉద్యోగులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం ఎక్సైజ్‌స్టేషన్–2, డీటీఎఫ్ సిబ్బంది శనివారం నగర శివారు గుదిమళ్ల, వెంకటగిరి క్రాస్ సమీపాన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన భూక్యా రవి, గుగులోత్ నరేశ్ ఏపీ నుంచి గూడ్స్ కారియర్ వాహనంలో 200 కేజీల నల్లబెల్లం, 20 లీటర్ల నాటుసారా తీసుకొస్తూ పట్టుబడ్డారు. అయితే, తనిఖీలను గుర్తించిన నరేశ్ పారిపోగా రవిని అదుపులోకి తీసుకుని వాహనంతోపాటు నాటుసారా, నల్లబెల్లం సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్, డీటీఎఫ్ సీఐలు చంద్రమోహన్, కరుణశ్రీ, ఎస్ఐ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

### చెరుకు కూలీ ఆత్మహత్యాయత్నం

**నేలకొండపల్లి:** పని కోసం వచ్చిన చెరుకు కూలీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏపీలోని ప్రకాశం జిల్లా పాలెంచెరువు గ్రామానికి చెందిన బి.వెంకటయ్య (47) మండలంలోని రాజేశ్వరపురంలో చెరుకు నరికేందుకు మరికొందరితో కలిసి వచ్చాడు. శనివారం మిగతా అందరూ పని చేస్తుండగా.. వెంకటయ్య పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాసేపటికి గమనించిన మిగతా కూలీలు ఆయనను ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆయన ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

### రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

**చింతకాని:** అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మండలంలోని జగన్నాథపురం సమీపాన ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేవని తేలడంతో వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

### బంగారం అనుకుని కాకి బంగారం లాక్కెళ్లారు..!

**కామేపల్లి:** ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధురాలిని గుర్తించి దుండగులు ఆమె చేతికి ఉన్న గాజులను బంగారమని భావించి లాక్కెళ్లారు. అయితే, అవి వన్‌గ్రామ్ గోల్డ్ కాగా ఎలాంటి నష్టం జరగకున్నా, గాజులు లాగే క్రమంలో ఆమె చేతులకు గాయాలయ్యాయి. కామేపల్లి మండలం పండితాపురానికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు పాటి బుషమ్మ శుక్రవారం రాత్రి ఇంటికి తాళం వేసి ఆరుబయట నిద్రించింది. ఈ మేరకు ముగ్గురు వ్యక్తులు ఆమె ముఖాన్ని గుడ్డతో కప్పి చేతికి ఉన్న గాజులు లాక్కుని పారిపోయారు. ఆమె కేకలు వేసినా చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో దుండగులు తప్పించుకున్నారు. కాగా, అవి వన్‌గ్రామ్ గోల్డ్ గాజులు కావడంతో కుటుంబీకులు ఊపిరి పీల్చుకోగా, పెనుగులాటలో వృద్ధురాలి చేతికి గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

### నగదు, ఆభరణాలు చోరీ

**కామేపల్లి:** ఇంట్లో దాచిన నగదు, బంగారాన్ని గుర్తు తెలియని దొంగలు పట్టపగలే దోచుకెళ్లిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. కామేపల్లి మండలం ఊట్కూర్‌కు చెందిన ఈర్ల వెంకటయ్య కుటుంబ సభ్యులు శుక్రవారం కూలీ పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని గమనించిన దొంగలు తలుపులు తీసి రూ.17 వేల నగదు, బంగారం పుస్తెలు ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన వెంకటయ్య ఘటనపై శనివారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

**బెల్టు షాప్‌లో చోరీ**

**పెనుబల్లి:** మండలంలోని మండలాపాడు పంచాయతీ పరిధి లంకాసాగర్ క్రాస్ వద్ద బెల్ట్‌షాప్‌లో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. లంకాసాగర్ క్రాస్ వద్ద ఒరుగంటి శివకుమార్ బెల్ట్‌షాప్, కూల్ డ్రింక్స్ షాపు నిర్వహిస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తులు షాపు తాళాలు పగులగొట్టి రెండు కేసుల బీర్లు, రూ.3 వేలు నగదు ఎత్తుకెళ్లారు. ఘటనపై శివకుమార్ చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.వెంకటేశ్ తెలిపారు.

### వ్యాపారినని నమ్మించి రూ.1.50 కోట్ల టోకరా

న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించిన బాధితులు

**ఖమ్మంక్రైం:** పెద్దస్థాయిలో ఆయిల్ వ్యాపారం చేస్తున్నానని నమ్మించిన వ్యక్తి రూ.10 వడ్డీ ఇస్తానంటూ నమ్మబలికి రూ.కోటికి పైగా అప్పులు చేసి ముఖం చాటేశాడు. ఖమ్మంలో శనివారం వెలుగుచూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలోని పంపింగ్ వెల్ రోడ్డు ఫిల్టర్ బెడ్ సమీపాన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన సలీం కొంతకాలం కిందట అద్దెకు దిగాడు. ఆయన అసలు పేరు కాదని తెలుస్తుండగా, సలీంగా చెబుతూ ఆయిల్ వ్యాపారం చేస్తున్నానని స్థానికులను నమ్మించాడు. రూ.10 వడ్డీ ఇస్తానంటూ కొందరి వద్ద అప్పు తీసుకుని సక్రమంగా చెల్లించాడు. దీంతో మిగతావారు కూడా రూ.లక్ష మొదలు రూ.10 లక్షల చొప్పున ఆయనకు ఇచ్చారు. నాలుగైదు నెలలు అడగకుండానే వడ్డీ చెల్లించిన ఆయన మొత్తం రూ.1.50 కోట్ల మేర అప్పులు చేయగా, కొద్ది నెలలుగా వడ్డీ ఇవ్వడం లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే వ్యాపారంలో నష్టం వచ్చిందని ఎదురు తిగరడంతో బాధితులు నిలదీశారు. కాగా, ఆయన అశ్వారావుపేటలోనూ పలువురి వద్ద అప్పులు తీసుకుని తల్లితో సహా ఖమ్మానికి మకాం మార్చినట్లు తేలింది. శనివారం ఆయన ఇంటి ఎదుట బాధితులు ఆందోళనకు దిగగా, సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు సలీంను స్టేషన్‌కు తరలించారు. కాగా, ఆయనను పోలీసులు విచారిస్తుండగా, ఒకరి వద్ద అప్పు చేసి మరొకరికి వడ్డీ పేరిట చెల్లించినట్లు గుర్తించారని సమాచారం.


అద్దె ఇంటి వద్ద సలీం

### పీఏసీఎస్ చైర్మన్ పదవికి రాజీనామా

**కామేపల్లి:** కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ తీర్థాల చిదంబరరావు శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల ఆయనపై డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించగా, ఈనెల 19న సొసైటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంతలోనే చైర్మన్ తన రాజీనామా లేఖను జిల్లా సహకార శాఖాధికారి మురళీధర్‌రావుకి అందజేశారు. దీంతో కామేపల్లి చైర్మన్ బాధ్యతలను వైస్‌చైర్మన్ కాత్రాల రోశయ్యకు అప్పగించినట్లు తెలిపారు. కాగా, చైర్మన్ రాజీనామాతో ఈ నెల 19న నిర్వహించాల్సిన సమావేశం రద్దయింది.











## క్లుప్తంగా

### యువతకు ఆదర్శంగా ఉపాధ్యాయుడు

● 42వ సారి రక్తదానం చేసిన క్రీస్తురాజు



రక్తదానం చేస్తున్న క్రీస్తురాజు

**అశ్వాపురం:** ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు క్రమం తప్పకుండా రక్తదానం చేస్తున్న అశ్వాపురం మండలం జగ్గారం యూపీఎస్ ఉపాధ్యాయుడు క్రీస్తురాజు ఆదర్శంగా నిలుస్తున్నారు. తాజాగా భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బి.జోగయ్య తీవ్ర రక్తహీనతతో బాధపడుతూ చికిత్స పొందుతుండగా, వైద్యులు అత్యవసరంగా రక్తం ఎక్కించాలని సూచించారు. ఈ మేరకు డాక్టర్ శ్రీనివాసరావు భద్రాచలంలోని మదర్‌థెరిస్సా ట్రస్ట్‌కు సమాచారం ఇవ్వగా, వారి వినతితో క్రీస్తురాజు శనివారం 42వ సారి ('ఏ'పాజిటివ్) రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను డాక్టర్ శ్రీనివాసరావు, ట్రస్ట్ నిర్వాహకులు అభినందించారు.

### శివాలయానికి 'మువ్వా' రూ.5 లక్షల వితరణ



ఆలయ అభివృద్ధికి నగదు అందజేస్తున్న విజయబాబు

**సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని గుడిపాడు శివాలయం పునఃప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఆలయ అభివృద్ధికి డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు రూ.5 లక్షల విరాళం ప్రకటించారు. ఈ నగదును శనివారం ఆయన ఆలయ కమిటీ బాధ్యుడు, రిటైర్డ్ జైలర్ కొల్లి నాగేశ్వరరావుకు అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగళ్ల ప్రసాద్, నాగళ్ల భాస్కర్‌చౌదరి, మిద్దే రామకృష్ణ, చల్లగుండ్ల కృష్ణయ్య, మాధురి మధు, బొంతు మాధవరావు, మారుతి బాబూరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### యూనివర్సిటీ ఉషూ మీట్‌లో కాంస్యపతకం



పతకం అందుకుంటున్న పవిత్రాచారి

**ఖమ్మంస్పోర్ట్స్:** జమ్మూకశ్మీర్ రాష్ట్రంలోని జమ్మూ యూనివర్సిటీల్లో తాజాగా జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఉషూ చాంపియన్‌షిప్‌లో ఖమ్మానికి చెందిన పి.పవిత్రాచారికి కాంస్య పతకం లభించింది. నాగూన్ చాక్ ఈవెంట్‌లో ఆమె అత్యుత్తమ పాయింట్లు సాధించి తృతీయస్థానంలో నిలిచింది. హైదరాబాద్ జేఎన్‌టీయూ తరఫున ప్రాతినిధ్యం వహించిన పవిత్రాచారి కాంస్య పతకం సాధించడంపై డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణాచారి అభినందించారు.

### ఐదు టన్నుల చేపలు మృత్యువాత



చెరువులో తేలుతున్న చనిపోయిన చేపలు

**నేలకొండపల్లి:** మండలంలోని చెరువుమాధారం చెరువులో నీటిమట్టం తగ్గిపోవడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. చెరువు అడుగంటి నీరంతా ఓ పక్కకు చేరడంతో భారీ సంఖ్యలో ఉన్న చేపలకు ఆక్సిజన్ అందడం లేదు. మరోపక్క రెండు రోజుల నుంచి చెరువులో మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారు. ఈ మేరకు బురద తాకిడికి చేపలు చనిపోతున్నట్లు తెలుస్తోంది. శనివారం 5 టన్నుల చేపలు చనిపోయి తేలగా ఒడ్డున గుంత తీసి పాతిపెట్టారు.

### సంఘానికి అందని గుర్తింపు పత్రం

సింగరేణి సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు గతేడాది డిసెంబర్ 27న జరగగా, ఐదు ఏరియాల్లో విజయం సాధించిన ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఎన్నికైంది. కానీ పారిశ్రామిక చట్టం ప్రకారం కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చించాలంటే కార్మిక శాఖ కార్యాలయం నుంచి గుర్తింపు సంఘం ఉత్తర్వులు అందాల్సి ఉంటుంది. ఎన్నికలు జరిగి 45 రోజులు దాటినా సంఘానికి గుర్తింపు పత్రం రాకపోగా, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఏఐటీయూసీ నాయకులు తెలిపారు.

# నాలుగు నెలలే అవకాశం

- కొన్నాళ్లుగా నిలిచిపోయిన 'సీతమ్మసాగర్'
- పర్యావరణ అనుమతులు లేక బ్యారేజీ నిర్మాణానికి అడ్డంకులు
- ఈ ప్రభుత్వమైనా చొరవ చూపితే అనుమతులు
- వేసవిలో చకచకా పనులు చేపట్టేందుకు వెసులుబాటు



కుమ్మరిగూడెంలో నిర్మాణుష్యంగా సీతమ్మసాగర్ బ్యారేజీ ప్రాంతం

**అశ్వాపురం:** మూడు జిల్లాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్ పనులు ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు అన్న చందంగా కొనసాగుతున్నాయి. పర్యావరణ అనుమతుల్లో జాప్యంతో కొన్నాళ్లుగా పనులు నిలిచిపోగా.. మళ్లీ ఎప్పుడు మొదలవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో ఇటీవల కొలువుదీరిన కొత్త ప్రభుత్వమైనా పర్యావరణ అనుమతుల కోసం కృషి చేస్తే రానున్న వేసవిలో నీటి నిల్వ తగ్గే సమయాన నాలుగు నెలల పాటు బ్యారేజీ పనులు చకచకా సాగే అవకాశముంది. ఈ మేరకు సీతారామ ప్రాజెక్ట్‌లో కీలకమైన బ్యారేజీ నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

**మూడు జిల్లాలకు సాగునీరు**

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో గోదావరి నదిపై ఉన్న దుమ్ముగూడెం ఆనకట్టకు 200 మీటర్ల దిగువన 37 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుగా బ్యారేజీ, బ్యారేజీకి అనుబంధంగా జల విద్యుత్ కేంద్రం నిర్మించేలా అప్పటి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఆరు బ్లాక్‌లుగా బ్యారేజీ పనులు చేపట్టి ఫియర్లు, స్పిల్‌వే నిర్మాణాలు చేపట్టారు. 30 శాతం పనులు పూర్తయ్యాక గేట్లు అమర్చే సమయాన గత మే నెలలో భూ నిర్వాసితులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)ను ఆశ్రయించారు. దీంతో పర్యావరణ అనుమతులు లేని కారణంగా పనులు నిలిపివేయాలని ఆదేశించింది. అలా ఎనిమిది నెలలుగా బ్యారేజీ పనులు నిలిచిపోయాయి.

**ప్రభుత్వం దృష్టి సారించేనా...**

ఇటీవల రాష్ట్రంలో కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించింది. అంతేకాకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క, మంత్రులుగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు అవకాశం దక్కగా సీతారామ ప్రాజెక్టుపై సమీక్ష జరిపారు. అంతేకాక ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు రూ.28,024 కోట్లు కేటాయించారు. ఈనేపథ్యాన గ్రీన్ ట్రిబ్యునల్, కేంద్ర పర్యావరణ శాఖ అనుమతుల కోసం ప్రత్యేక దృష్టి సారిస్తే ఫలితం ఉంటుంది. సీతమ్మసాగర్ బ్యారేజీ పూర్తయితేనే ప్రతిష్టాత్మకమైన సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాకు సాగునీరు అందించే అవకాశం ఉంది.

**ఈ నాలుగు నెలలే కీలకం..**

సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణ పనులకు వేసవిలో నాలుగు నెలలు పనులకు అనుకూలంగా ఉంటుంది. గోదావరిలో నీటి మట్టం తగ్గే మార్చి నుంచి జూన్ వరకు బ్యారేజీ పనులు వేగంగా చేపట్టవచ్చు. మళ్లీ వర్షాకాలం వస్తే వరదల కారణంగా పనులకు ఆటంకం ఏర్పడి నవంబర్ వరకు ఆగాల్సి ఉంటుంది. ఈ నేపథ్యాన ప్రభుత్వం త్వరగా అనుమతులు సాధించగలిగితే ఈ సీజన్‌లో పనులు పునఃప్రారంభించే అవకాశముంది.

**అనుమతులపై దృష్టి సారించాం**



సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ పనులు ఎన్‌జీటీ ఆదేశాలతో నిలిచిపోయాయి. అయితే, బ్యారేజీనే కాకుండా మొత్తం ప్రాజెక్ట్ పర్యావరణానికి సంబంధించిన అంశంపై సుప్రీంకోర్టులో స్టే ఉంది. అక్కడి నుంచి క్లియరెన్స్ వస్తే పర్యావరణ అనుమతుల ప్రక్రియ ముందుకు సాగే అవకాశం ఉంటుంది. ఈ మేరకు పర్యావరణ అనుమతులపై ప్రత్యేక దృష్టిసారించాం.

– శ్రీనివాసరెడ్డి, జలవనరుల శాఖ సీఈ

# రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కలు



రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలు అందజేస్తున్న డీఓ, నాయకులు

**అశ్వారావుపేటరూరల్:** సాగు భూమిలో నీటి వసతి ఉండి, ఆసక్తి కలిగిన రైతులందరికీ రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కలు అందజేస్తామని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ అధికారి ఆకుల బాలకృష్ణ తెలిపారు. అశ్వారావుపేట మండలంలోని నారంవారిగూడెం వద్ద ఉన్న ఆయిల్‌ఫెడ్ నర్సరీలో రైతులకు శనివారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఓ మాట్లాడుతూ.. సాగు భూమి కలిగిన రైతులు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, అంగీకార పత్రంతో తమను సంప్రదించాలని సూచించారు. ఆపై క్షేత్రస్థాయి సిబ్బందితో విచారణ చేయించి మొక్కలు అందిస్తామని తెలిపారు. కాగా, ఆయిల్‌పామ్ మొక్కల కోసం ఇప్పటివరకు 253 మంది రైతులు 614 ఎకరాల్లో సాగుకు దరఖాస్తు చేసుకోగా, 35 వేల మొక్కలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేశ్, ఏరియా ఇన్‌చార్జ్‌లు సతీశ్, అప్పారావు, ఫణికుమార్, శివానీ నర్సరీ ఇన్‌చార్జ్ మహేశ్, నంద్రు రమేశ్ పాల్గొన్నారు.

# డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన 'దొండపాటి'



వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు చెబుతున్న డీసీసీబీ అధికారులు

**ఖమ్మంవ్యవసాయం:** ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా దొండపాటి వెంకటేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. సుమారు నాలుగేళ్లపాటు చైర్మన్‌గా కొనసాగిన కూరాకుల నాగభూషణంపై రఘునాథపాలెం మండలం వీవీ పాలెం పీఏసీఎస్‌లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో ఆయన ఆయన పీఏసీఎస్, డీసీసీబీ చైర్మన్ పదవులు కోల్పోయారు. దీంతో వైస్ చైర్మన్‌గా ఉన్న వెంకటేశ్వరరావుకు చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన మధిర మండలం ఖమ్మంపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా కొనసాగుతూ డీసీసీబీ వైస్ చైర్మన్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వరరావును డైరెక్టర్లు చావా వేణుగోపాలకృష్ణ, నిర్మల పుల్లారావు, నూకల సైదులు, పేరబత్తిని ప్రసాద్, జనరల్ మేనేజర్లు నర్మద, పద్మావతి, డీజీఎం ఉపేందర్ రావుతో పాటు డైరెక్టర్లు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# మెడికల్ బోర్డుపై ప్రత్యేక దృష్టి

- కార్మికుల సొంతింటి కల సాకారానికి కృషి
- గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్



కొరిమి రాజ్‌కుమార్

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి లోపాలను సరిదిద్దేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని గుర్తింపు సంఘం(ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న అర్హులందరినీ అన్‌ఫిట్ చేసేలా కృషి చేస్తామన్నారు. అలాగే, దళారీ వ్యవస్థపై ఉక్కుపాదం మోపేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఇక తమ సంఘం ఎన్నికల మేనిఫెస్టోలో వెల్లడించినట్లు కార్మికుల సొంతింటి కల సాకారం విషయమై కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తామని తెలిపారు. ఇంకా కొత్త గనుల ఏర్పాటు, కార్మికుల సంఖ్య పెంపు, అలియాస్ పేర్ల మార్పిడి సమస్య, సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలుకు తమ సంఘం తరఫున కృషి చేస్తామని రాజ్‌కుమార్ వెల్లడించారు.

### ఎంపీహెచ్‌డబ్ల్యూఓ ర్యాంకర్లకు అభినందన



ర్యాంకర్లను అభినందిస్తున్న కలెక్టర్ గౌతమ్

**ఖమ్మంఅర్బన్:** ఖమ్మంలోని మహిళా ప్రాంగణంలో కొనసాగుతున్న ఎంపీహెచ్‌డబ్ల్యూఓ కోర్సు మొదటి సంవత్సరంలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన అభ్యర్థులను శనివారం కలెక్టర్ వీపీ గౌతమ్ అభినందించారు. రాష్ట్రస్థాయిలో బైరం రచన, సాలవాడి మనీల 2, 4వ ర్యాంకులు సాధించడం, జిల్లా స్థాయిలో మొదటి పది ర్యాంకులు మహిళా ప్రాంగణం అభ్యర్థులే సాధించడంపై కలెక్టర్ ప్రశంసించారు. మహిళా ప్రాంగణం అధికారి వేల్పుల విజేత, ఉద్యోగులు నాగ సరస్వతి, స్పందన, మల్లిక, హిమబిందు, రమేశ్, విజయ్‌కుమార్, సుకన్య, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

### పొంగులేటి ఇంట నేడు రిసెప్షన్



ఏర్పాట్లపై ఆరా తీస్తున్న ప్రసాదరెడ్డి

**కల్లూరు/కల్లూరురూరల్:** కల్లూరు మండలంలోని నారాయణపురం సమీపాన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడైన ప్రసాదరెడ్డి తనయుడు లోహిత్‌రెడ్డి వివాహ రిసెప్షన్ ఆదివారం జరగనుంది. ఈ సందర్భంగా సినిమా సెట్టింగ్‌ను తలపించేలా వేదిక ఏర్పాటు చేయగా, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరుకానుండడంతో హెలీప్యాడ్ సిద్ధం చేశారు. వాహనదారులకు ఇబ్బంది ఎదురుకాకుండా షుగర్ ఫ్యాక్టరీ మీదుగా తిరువూరు వెళ్లే రహదారిని మూసివేసి కల్లూరు నుంచి తిరువూరు వెళ్లే వాహనాలను పెనుబల్లి మీదుగా మళ్లిస్తున్నారు. రిసెప్షన్ ఏర్పాట్లను శనివారం పొంగులేటి ప్రసాదరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

# ఈ 'బాధ్యత' బరువేం కాదు..



చీరతో నడుముకు కుమారుడిని కట్టుకుని మిర్చి కోస్తున్న కూలీ

పొట్ట కూటి కోసం ఊరు కాని ఊరు వచ్చారు. పిల్లాపాపలతో సహా కుటుంబం అంతా కూలీ పనుల కోసం రావడంతో పిల్లలను ఒంటరిగా వదిలి ఉండలేని పరిస్థితి. మహారాష్ట్ర నుంచి కామేపల్లి మండలం అబ్బాసుపురంలో మిర్చి కోతకు వచ్చిన వలస కూలీలను శుక్రవారం పరిశీలించగా.. ఓ మహిళా కూలీ తన కుమారుడిని వీపుకు చీరతో కట్టుకోగా.. ఇంకో కూలీ తన కుమార్తెను భుజాలపై కూర్చోబెట్టుకుని మరీ మిర్చి ఏరుతుండడం కనిపించింది. – కామేపల్లి

# మావోయిస్టు నేత హిడ్మా స్వగ్రామంలో సీఆర్‌పీఎఫ్ క్యాంప్

**చర్ల:** తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు దండకారణ్యంపై పట్టు సాధించేలా పోలీసు బలగాలు దూసుకెళ్తున్నాయి. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా, అటు ఛత్తీస్‌గఢ్ నుంచి భద్రాద్రి జిల్లా సరిహద్దు వైపునకు పలు గ్రామాల్లో పోలీసు క్యాంపులను ఏర్పాటు చేస్తూ దండకారణ్యాన్ని ఆధీనంలోకి తీసుకుంటున్నాయి. మరోపక్క ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా – బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లోనూ క్యాంపులు ఏర్పాటుచేస్తున్నారు. ఈ నేపథ్యాన పోలీసుల హిట్‌లిస్ట్‌లో ఉన్న మావోయిస్టు పార్టీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ మొదటి బెటాలియన్ కమాండర్, కేంద్ర కమిటీ సభ్యుడు మడవి హిడ్మా స్వగ్రామమైన పువ్వర్తిలోనూ శుక్రవారం సీఆర్‌పీఎఫ్ క్యాంప్ ఏర్పాటు చేశారు. పువ్వర్తితో పాటు సమీపాన ఉన్న కొరగట్ట, మీనగట్ట, జబ్బగట్ట, కంచాల తదితర గ్రామాలు మావోయిస్టులకు కంచుకోటలుగా ఉన్నాయి. ఈ ప్రాంతాలకు సమీపాన సీఆర్‌పీఎఫ్ క్యాంప్ ఏర్పాటు చేయడాన్ని బలగాల వైపు విజయంగా భావిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన బీజేపీ ప్రభుత్వం మావోయిస్టుల కార్యకలాపాలను కట్టడి చేసే క్రమంలో పెద్ద ఎత్తున క్యాంప్‌ల ఏర్పాటుకు సిద్ధమైనట్లు తెలుస్తుండగా బలగాలు దండకారణ్యంపై పట్టు సాధించే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

# రూ.కోటి విలువైన గంజాయి పట్టివేత

- 4 క్వింటాళ్లు స్వాధీనం.. ఎనిమిది మంది అరెస్టు
- వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న భద్రాద్రి జిల్లా ఎస్పీ

**కొత్తగూడెంటౌన్:** భద్రాచలంలో అక్రమంగా తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్పీ బి.రోహిత్‌రాజ్ తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.కోటి ఉంటుందని చెప్పారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. గంజాయి అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో భద్రాచలం పట్టణ పోలీసులు శనివారం తెల్లవారుజామున స్థానిక ఇందిరాగాంధీ బొమ్మ సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేశారని, ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి నుంచి హైదరాబాద్ వెళ్లే ఓ ప్రైవేట్ బస్సును ఆపి తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి కంగారుగా బస్సు దిగేందుకు ప్రయత్నించాడని చెప్పారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా తనతో పాటు బంధువులు కూడా గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. ఎవరికీ అనుమానం రాకుండా ప్లాస్టిక్ ట్రేల మధ్యలో గంజాయి అమర్చి తీసుకెళ్తున్నామని, డోర్ మ్యాట్‌లను మధ్యలో కత్తిరించి అందులో గంజాయిని తరలిస్తున్నట్లు అంగీకరించారని చెప్పారు. మొత్తం ఎనిమిది మందిని అరెస్ట్ చేసి రూ.కోటి విలువైన నాలుగు క్వింటాళ్ల గంజాయి స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అరెస్టయిన వారిలో హరియాణా రాష్ట్రం పానిపట్ జిల్లా మల్కా గ్రామానికి చెందిన బల్జిత్, రవిదాస్, గిన్నా, హిల్సర్ జిల్లా నర్నడ కు చెందిన తక్‌దిర్, రామ్‌మెహర్, సుందర్, రాజ్‌పతి, సూరజ్ ఉన్నారని వివరించారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆయన వెంట భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, సీఐలు ఉన్నారు.

**ఇల్లెందులో 12 కేజీలు..**

**ఇల్లెందు:** ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి తరలిస్తుండగా ఇల్లెందు బస్టాండ్‌లో పోలీసులు పట్టుకున్నారు. శనివారం ఎస్‌ఐ అప్పారావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఒడిశాలోని మల్కాన్‌గిరి, కోరాపూట్‌లకు చెందిన గణేశ్వర్‌పూజారీ, సత్యమాగ్జిలు అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు ప్రశ్నించారు. పారిపోతుండగా పట్టుకుని విచారించగా రూ. 2.40 లక్షల విలువైన 12 కిలోల గంజాయి తరలిస్తున్నట్లు తేలింది. నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# ముగిసిన మత్స్యకారుల శిక్షణ



సర్టిఫికెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

**కూసుమంచి:** మండలంలోని పాలేరు గ్రామంలోని శ్రీ పీవీ నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో మత్స్యకారులకు దేశవాళీ తెల్లచేపల పెంపకం అంశంపై ఇస్తున్న మూడు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ జిల్లాలకు చెందిన మత్స్యకారులు పాల్గొనగా వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ మేరకు ముగింపు సమావేశంలో మత్స్య శాస్త్రవేత్త బి.లవకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. చేపల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిడుబడులు సాధించొచ్చని తెలిపారు. పాలేరు పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ.. మూడు రోజుల శిక్షణలో తెలుసుకున్న అంశాలను మత్స్య సంపద వృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రవీందర్, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది లేరంటూ వార్డుల కుదింపు!




భద్రాచలం ఏరియా ఆస్పత్రి

- గిరిజనులకు వైద్య సేవలు అంతంతేనా ?
- డిప్యుటేషన్‌పై కేటాయించాలనే డిమాండ్లు
- 'వైద్యం అందేదెలా' కథనంపై అధికారుల వివరణ కోరిన కలెక్టర్

**భద్రాచలం:** భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో నర్సింగ్ సిబ్బంది బదిలీలు, కొరతపై సాక్షిలో ప్రచురితమైన 'వైద్యం అందేదెలా' కథనంపై కలెక్టర్ ప్రియాంక అల, జిల్లా వైద్యశాఖాధికారులు స్పందించారు. డిప్యుటేషన్‌పై ఇతర ఆస్పత్రులకు వెళ్లిన ఐదుగురు సిబ్బందిని వెనక్కు రప్పించారు. అయితే ఈ సిబ్బంది సరిపోరని, పేషెంట్లకు పూర్తిస్థాయిలో సేవలందాలంటే మరింత మంది అవసరమని డాక్టర్లు అంటున్నారు.

**స్పందించిన కలెక్టర్..**

జీఓ 317 బదిలీల్లో భాగంగా భద్రాచలంలో పనిచేస్తున్న వారిలో 23 మందిని ఇదే జోన్‌లో గల ఇతర జిల్లాలకు పంపించారు. దీంతో కొద్ది రోజులుగా వైద్య సేవలు కుంటుపడ్డాయి. ఈ సమస్యపై సాక్షిలో ప్రచురితమైన 'వైద్యం అందేదెలా..?' కథనానికి స్పందించిన కలెక్టర్ ప్రియాంక అల వెంటనే నివేదిక అందచేయాలని ఆదేశించడంతో ఆస్పత్రి పరిస్థితిపై జిల్లా వైద్యాధికారులు లిఖితపూర్వక నివేదిక సమర్పించారు.

**ఐదుగురి డిప్యుటేషన్ రద్దు..**

బదిలీ అయిన 23 మంది సిబ్బందిలో 17 మంది స్థానికులు కావడంతో వారిని ఇక్కడే పనిచేయించేందుకు ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వప్రయత్నం చేశారు. అయితే బదిలీ అయిన వారి పదోన్నతుల దృష్ట్యా శుక్రవారం రాత్రి వారికి రిలీవింగ్ ఆర్డర్లు అందచేశారు. కాగా, ఆస్పత్రి పరిస్థితిని చక్కదిద్దేందుకు ఇక్కడి నుంచి డిప్యుటేషన్‌పై వెళ్లిన ఐదుగురిని తిరిగి రప్పించారు.

**వార్డుల కుదింపునకు ప్రయత్నాలు..**

కాగా, ఈ ఐదుగురు సిబ్బంది కేటాయింపు కంటి తడుపు చర్యేననే విమర్శలు వినిపిస్తున్నాయి. నర్సింగ్ సిబ్బంది లేరనే సాకుతో ఏరియా ఆస్పత్రిలోని పలు వార్డులను మూసివేయాలని, లేదా కుదించాల ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన అనేక మంది పేద గిరిజనులు వైద్య సేవలు అందక నష్టపోయే ప్రమాదం ఉంది. జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కళాశాలలో 230 మంది సిబ్బంది పనిచేస్తున్నారని, వీరిలో కొందరిని ఈ ఆస్పత్రికి కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు. ఆదివారం భద్రాచలానికి వచ్చే మంత్రులైనా దీనిపై దృష్టి పెట్టాలని వేడుకుంటున్నారు.

# బొగ్గు రవాణాలో కొత్తగూడెం ఏరియా రికార్డ్



ఆర్‌సీహెచ్‌పీ నుంచి బొగ్గు రవాణా చేస్తున్న వ్యాగన్

**సింగరేణి(కొత్తగూడెం):** బొగ్గు రవాణాలో సింగరేణి పరిధిలోని కొత్తగూడెం ఏరియా రికార్డు సృష్టించిందని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలో శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏరియా నుంచి 2,702 రేకుల బొగ్గు రవాణా చేయాలనేది లక్ష్యం కాగా, ఈ నెల 15 నాటికి అంటే 45 రోజుల ముందుగానే 2,710 రేకుల బొగ్గు రవాణా చేసి రికార్డు సృష్టించినట్లు తెలిపారు. సత్తుపల్లి జేవీఆర్‌లోని సమంత సీహెచ్‌పీ నుంచి 2,200 రేక్‌లు, రుద్రంపూర్‌లోని ఆర్‌సీహెచ్‌పీ ద్వారా 510 రేక్‌ల బొగ్గు రవాణా చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏరియాను సింగరేణి వ్యాప్తంగా అగ్రగామిగా నిలిపిన అధికారులు, కార్మికులకు జీఎం ధన్యవాదాలు తెలిపారు. కాగా, 2019–20 ఆర్థిక సంవత్సరంలో ఏరియా నుంచి 2,752 రేక్‌ల బొగ్గును రవాణా చేయగా, ఈ ఏడాది ఆ రికార్డును దాటుతామని ధీమా వ్యక్తం చేశారు.

### 28 నుంచి కరుణగిరి మహోత్సవాలు



ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బిషప్‌లు

**ఖమ్మంరూరల్:** మండలంలోని నాయుడుపేట కరుణగిరి చర్చిలో జరగనున్న ఉత్సవాల పోస్టర్లను శనివారం బిషప్‌లు ఉడుముల బాల, ప్రకాష్, మాథ్యూ వరప్రసాద్‌రాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిషప్ బాల మాట్లాడుతూ ఈ నెల 28, 29, మార్చి 1, 2వ తేదీల్లో జరిగే కరుణగిరి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు తెలంగాణతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నట్లు పేర్కొన్నారు. తొలిరోజు పతాకావిష్కరణతో ఉత్సవాలు ప్రారంభం కానుండగా, ప్రతిరోజూ మతగురువులతో దైవ సందేశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ ఆర్‌సీఎం చర్చిల మతగురువులు, నిర్వహణ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.